కొత్తగా కలం
పట్టిన రచయిత(త్రు)లు
మాత్రమే
ఈ శీర్షికలో
పాల్గొనాలి
ఇన్‌లాండ్
కవర్లమీదే
తమ కథలను
పంపాలి.

## ఇన్‌లాండ్ లెటర్ కథలు



## తాహతు

'ఆంటీ' మా అమ్మ నాలుగు ఉల్లిపాయలు ఇమ్మంటోంది' అంటున్న పక్కింటి అమ్మాయిని చూసి మా పాప నేను ఏం చెప్పకుండానే ఉల్లిపాయలు తెచ్చి ఇచ్చింది.

ఆ పిల్ల రోజుకి నాలుగుసార్లు 'ఆంటీ!- నాలుగు పచ్చిమిర్చి, కొంచెం కరివేపాకు, ఆంటీ!- ఒక గ్లాసు పాలు, తోడుకి పెరుగు' అంటూ వస్తూనే ఉంటుంది. ఏ నెల సరుకులు ఆ నెల తెచ్చుకునే మామూలు మధ్యతరగతి బతుకుల్లో నెలాఖరుకి సరుకులు అయిపోతూ ఉండడం, గ్లాసో గిన్నో పట్టుకుని పక్కింటికి అప్పుకి వెడుతూ వుండడం సర్వసాధారణం- అందులోనూ నలుగురు పిల్లలు, మరుదులు, ఆడపడుచులతో ఎంత సంపాదించినా తిండికే చాలని పక్కింటి సంసారం అంటే నాకు ఏదో జాలి- ఏది అడిగినా లేదు అనాలనిపించదు.

'ఆంటీ!- మా అమ్మ పిలుస్తోంది' అంటూ మళ్ళీ వచ్చింది ఆ పాప. వాళ్ళు వచ్చి అయిదారు నెలలయినా నేను వెళ్ళింది ఏ రెండు మూడు సార్లో- రండి రండి అంటూ ఆహ్వానించింది ఆవిడ నవ్వు మొహంతో- ఎదురుగా చాప నిండా పరిచిన వెంకటగిరి జరీ చీరెలు.

'ఇతను మాకు బాగా తెలుసు- వెంకటగిరి మగ్గాల దగ్గర మంచి తెస్తారు జరీ చీరెలు- మంచి నాణ్యత ఉన్న సరుకు- మీరు ఏమైనా తీసుకుంటారేమోనని పిలిచాను' అంటూ పరిచయం చేసింది అతన్ని.

అన్నీ మంచి ముదురు రంగులే- అరచేతి వెడల్పు జరీతో ధగధగలాడుతున్నాయి- వెయ్యి రూపాయలకు తక్కువ చీరే లేదు వాటిలో- నెల వారీ బడ్జెట్‌లో లేకుండా ఒక్కసారి వెయ్యి రూపాయల చీర కొనడం నా వల్ల కాదు- పండుగకో పబ్బానికో అయితే ఏమో కానీ హాబీగా చీరలు కొనే అలవాటూ లేదు. పెద్ద పెద్ద మాటలెందుకు కానీ రెండుపూటలా కడుపునిండా అన్నం తిని చిన్నదానికి, పెద్దదానికి ఎదురింటికీ పక్కింటికీ అప్పుకి వెళ్ళకుండా ఉంటే పట్టుచీర రోజూ కట్టుకున్నట్టే నా దృష్టిలో.

ఆలోచనలు ఆపి 'నాకేం వద్దులెండి- ఆయనతో చెప్పకుండా నేనేం తీసుకోను' అనేశాను ఆ అమాయకుడి మీదకి అంతా నెట్టేస్తూ. అతను అందుకుని 'అబ్బే! డబ్బులు ఇవ్వకపోయినా ఫర్వాలేదమ్మా- నేను నెలనెలా వస్తాను- నాలుగైదు ఇన్‌స్టాల్‌మెంట్లలో కట్టచ్చు' అన్నాడు. నేను డబ్బుల కోసం సందేహిస్తున్నాననీ- నేనేం మాట్లాడలేదు.

ఇంతలో ఆవిడ లోపల నుంచి రెండు చీరెలు తెచ్చి చూపించింది. ముదురు వంగపండు రంగ, లేత గులాబీ... చక్కగా ఉన్న ఆ చీరెల ఖరీదు రెండు వేల అయిదు వందలు- ఇన్ని డబ్బులెలా ఇస్తారా ఈవిడ అనుకుంటూ ఉండగానే ఆవిడే ఆ చిక్కుముడి విప్పేసింది.

'బావున్నాయా? కావాలంటే మీరు తీసుకోండి- ఇలాంటివి మగాళ్ళకి చెప్ప కూడదు- ఇంటి ఖర్చులకని ఇచ్చిన డబ్బులలో మిగుల్చుకుని ఇన్‌స్టాల్‌మెంట్ కట్టెయ్యడమే' అంటూ చిదంబర రహస్యం చెప్తున్న ఆవిడని చూసి అవాక్కయిపోయాను.

ఆ తర్వాత ఉల్లిపాయలూ, పచ్చిమిర్చిలూ బంద్ అని వేరే చెప్పాలా!

-వాణీప్రభ

## గడ్డిపూలు కథ

పోచమ్మకి మూడు రోజుల నుంచి జ్వరం. మూసిన కళ్ళు తెరవకుండా మూలుగుతూ పడుకుంది. కోటయ్యకి ఏమీ తోచడం లేదు. కాలుగాలిన పిల్లిలాగా తిరుగుతున్నాడు. ఇటు, అటు భిక్షం కూడా వెళ్ళలేకపోతున్నాడు. ఇద్దరూ కలిసే భిక్షం ఎత్తుకుని తిరిగే వాళ్ళు. కోటయ్యకి ఒక్కడే వెళ్ళాలనిపించలేదు.

ఏందే పోచమ్మా గుక్కెడు నీళ్ళయినా ముట్టనైతివే. లే జర ఛా తాగుదుగాని అని రెక్కలు క్రింద చేతులు వేసి లేవనెత్తేడు. పోచమ్మ మాత్రం లేవలేక క్రిందికి ఒరిగిపోయింది. జ్వర తీవ్రం ఎక్కువగా ఉంది.

ప్రక్క తన తోటి బిచ్చగాళ్ళ సహాయంతో రిక్షాలోకి పోచమ్మ నెక్కించి ఆసుపత్రికి తీసుకెళ్ళేడు. పోచమ్మని ఒడిలో పడుకో పెట్టుకొని డాక్టరు పరీక్ష కోసం కొన్ని గంటలు వేచి చూసేడు. బారెడు పొద్దెక్కింది. డాక్టరు పిలుపుకు పోచమ్మని తీసుకెళ్ళేడు కోటయ్య. డాక్టరు చీటి రాసి కోటయ్యకిచ్చేడు.

జరా నోట్లో వుల్లపెట్టి సూడండి దొరా అన్నాడు కోటయ్య. డాక్టరు తీక్షణంగా కోటయ్యను చూసేడు. కోటయ్య గడగడ ఒణికడిపోతూ చెవుల్లో గొట్టాలన్నీ పెట్టి చూడరైతిరి. గొణుక్కుంటూ పోచమ్మని తీసుకొని వెళ్ళిపోయాడు. డాక్టరు రాసిచ్చిన కాయితం కొంగులో గట్టిగా కట్టుకున్నాడు. పోచమ్మ పరిస్థితి బాగా దిగజారిపోయింది. కళ్ళు కూడా తెరవకుండా పడుకుంది. నీళ్లు పోసినవి మింగుడు పడలేదు. కోటయ్య మందులు కొనాలని బజారుకెళ్ళాలని బయలుదేరేడు. ప్రక్కన బిచ్చగాళ్ళు పోచక్క దగ్గర కనిపెట్టుకుని ఉన్నారు. పోచమ్మ పూర్తిగా చల్లబడిపోయింది.

కోటయ్యకి చిన్నప్పట్నుంచి ఎవరూ లేరు. రైళ్ళలో పాటలు పాడుకుంటూ భిక్షమెత్తుకుంటూ పొట్ట పోషించుకునే వాడు. తనతో పాటే భిక్షమెత్తుకునే పోచమ్మ తల్లి చనిపోతూ పోచమ్మని కోటయ్యకి అప్పజెప్పింది.

పోచమ్మను చేరదీసి పెండ్లి చేసుకున్నాడు. అప్పటినుండి పోచమ్మ, కోటయ్య భిక్షం ఎత్తుకుని జీవనం సాగిపోయేది. పోచమ్మ ప్రక్కన లేనిదే కోటయ్య. కోటయ్య లేనిదే పోచమ్మ ఉండలేకపోయే వారు. పుట్టిన ఒక్క కొడుకు ఎక్కడకో వెళ్ళిపోయాడు. వాళ్ళు అందుకు కూడా బాధపడలేదు. భిక్షం ఎత్తుకునే బ్రతుకు ఎక్కడైనా ఒక్కటే అనుకున్నారు.

కోటయ్య డాక్టరు రాసిన మందు చీటి, కొంగులో కట్టుకున్న నలిగిపోయిన నోట్లు తీసి మందుల షాపు వైపు పరుగెత్తాడు. తొందరగా మందు తీసికెళ్ళి తెస్తే పోచమ్మ జ్వరం తగ్గుతుంది. నా పోచి నాకు దక్కుతుంది. నా పోచి లేనిదే నేను ఒక్క క్షణం నిలవలేను. ఎందుకో ఏడ్పు ముంచుకొచ్చి కళ్ళు కనబడలేదు. కన్నీళ్ళు అడ్డం పడి.

పోలీసులు దుకాణాలు మూయిం చేస్తున్నారు. కనబడిన వాళ్ళనంతా లాఠీతో కొట్టి చెదరగొడుతున్నారు. హర్తాలు జరుగుతున్నాయి. అందరూ భయపడి పరుగులు తీస్తున్నారు. కోటయ్యకు ఏమీ అర్థం కాలేదు. మందుల షాపు దగ్గరకు చేరుకున్నాడు.

అయ్యా ఈ చీటీలో మందులియ్యమని అందించే లోపలే పోలీసులు దుకాణం దగ్గర చేరేరు. దుకాణం దారు దుకాణం మూసేసి పరిగెత్తేడు. పోలీసులు లాఠీతో కోటయ్య తలపైన గట్టిగా కొట్టేరు. కోటయ్య స్పృహ లేకుండా పడిపోయాడు. కొంచెం సేపట్లోనే కోటయ్య మరణించేడు.

-పూడిపెద్ది పార్వతీదేవి